నేటి బీఆర్ఎస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పార్టీ భూపాలపల్లి అర్బన్ అధ్యక్షుడు జనార్దన్

కృష్ణకాలనీ, డిసెంబర్ 16 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ పటేల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ విధానాలకు నిరసనగా ఉదయం 11 గంటలకు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

19న షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై బహిరంగ విచారణ

భూపాలపల్లి రూరల్/ ములుగు రూరల్, డిసెంబర్ 16 : హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై 19న బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు కలెక్టర్లు రాహుల్‌శర్మ, టీఎస్ దివాకర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ శమీమ్ అక్తర్ షెడ్యూల్డ్ కులాల ప్రతినిధుల నుంచి 19న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వినతులు స్వీకరిస్తారని తెలిపారు. వినతులు ఇచ్చే వారు హనుమకొండ కలెక్టరేట్‌లో గురువారం ఇవ్వాలని సూచించారు.

భద్రతతోనే ప్రమాదాలు నివారించవచ్చు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 16 : భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని భూపాలపల్లి యాక్టింగ్ జనరల్ మేనేజర్ టీ వెంకటరాంరెడ్డి అన్నారు. సోమవారం 55వ వార్షిక రక్షణ భద్రతా పక్షోత్సవాలను కేటీకే ఓసీ-2 ప్రాజెక్ట్‌లో నిర్వహించగా ముఖ్య అతిథులుగా యాక్టింగ్ జనరల్ మేనేజర్ వెంకటరాంరెడ్డి, కన్వీనర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరాంరెడ్డి మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి సేకరణలో భద్రత నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం ఓసీ-2 ప్రాజెక్ట్‌లోని వివిధ ప్రదేశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ గుప్తా, కేటీకే ఓసీ- 2 మేనేజర్ బీ కృష్ణ ప్రసాద్, కేటీకే ఓసీ-2 ప్రాజెక్ట్ ఇంజినీర్ కృష్ణయ్య, సింగరేణి అధికారులు నజీర్, ప్రశాంత్, శేషగిరి రావు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ మృతి

టేకుమట్ల, డిసెంబర్ 16 : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. అసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉడుత కుమారస్వామి కూతురు స్రవంతి (22)ని కొత్తపల్లి (గోరి) మండలకేంద్రానికి చెందిన బైకాని సాయికుమార్‌తో 2019లో వివాహం జరిపించారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. టేకుమట్ల మండలకేంద్రానికి చెందిన మచ్చ రాకేశ్ ఈ నెల 5న కొత్తపల్లి (గోరి)లోని స్రవంతి ఇంటికి వచ్చి తనతో రావాలని బలవంతం చేశాడు. ఈ క్రమంలో ఆమె మామయ్య మల్లయ్య, అతడికి మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయంపై రేగొండ పోలీస్ స్టేషన్లో రాకేశ్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో స్రవంతి భర్త ఆమెను ఈ నెల 6న పుట్టింటి వద్ద దింపి వెళ్లాడు. దీంతో మనస్తాపం చెందిన స్రవంతి ఈ నెల 13న అర్ధరాత్రి వారి పత్తి చేనులో పురుగుల మందు తాగి పడిపోయింది. కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం చిట్యాల సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గోవిందరావుపేట, డిసెంబర్ 16 : సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సోమవారం పస్రా జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ 4వ మహాసభ నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను క్లియర్ చేయాలని అన్నారు. అన్ని యాజమాన్యాల్లో ఉన్న సీనియర్ ఎస్‌జీటీలకు పీఎస్ హెడ్ మాస్టర్ ప్రమోషన్ కల్పించాలని, ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం జిల్లా కమిటీని రాష్ట్ర కార్యదర్శులు రంజిత్, మల్లారెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పోడెం సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా రెడ్డి వాసుదేవరెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకటస్వామి, అరుణ, కోశాధికారిగా వెంకటస్వామి, కార్యదర్శులుగా చెంచయ్య, లక్ష్మీనారాయణ, ఎస్ పాపారావు, రఘురాం, శివరాం, స్వరూప, బాలాజీ, లక్ష్మారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా లావుడ్యా దశ్రునాయక్, సభ్యులుగా హనుమంతు, సమ్మయ్య, చెంచయ్య, రఘురాం, ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి గొప్ప సమ్మరావు, ఉమ్మడి జిల్లాల మాజీ ప్రధాన కార్యదర్శి బద్దం వెంకట్‌రెడ్డి, వెంకటాపురం ఎంఈవో సత్యనారాయణ, వాసం సాంబశివరావు, బుచ్చయ్య పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ
- ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి జిల్లా స్థాయి క్రీడలు ప్రారంభం

టాస్ వేసి క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే, కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణకాలనీ, డిసెంబర్ 16: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తీసుకురావాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. సోమవారం అంబేద్కర్ క్రీడా మైదానంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా స్థాయిలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ గెలుపు ఓటమితో సంబంధం లేకుండా క్రీడాకారులు ఆటల్లో పాల్గొనాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, ఎస్‌జీఎఫ్ క్రీడల జిల్లా కార్యదర్శి రమేశ్, పీడీలు, పీఈటీలు, ఆయా విభాగాల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పూతల సమ్మయ్య, జల్ది రమేశ్, జాగరి అజయ్ యాదవ్, దేవేందర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

ములుగులో పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

భూపాలపల్లి రూరల్/ గణపురం/ ములుగు రూరల్, డిసెంబర్ 16 : రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న గ్రూప్ -2 పరీక్షలు ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ప్రశాంతంగా ముగిశాయి. ములుగు జిల్లా బండారుపల్లి మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రానికి కలెక్టర్ టీఎస్ దివాకర ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీజీపీఎస్సీ నిబంధనల ప్రకారం పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ తీసుకురావద్దనే నియమాన్ని కలెక్టర్ పాటించారు. తన ఫోన్‌ను వాహనంలోనే వదిలి వెళ్లి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. న్విజిలేటర్లకు, చీఫ్ సూపరిండెంట్లకు, అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ సంపత్‌రావు ఉన్నారు. కాగా, ఉదయం సెషన్‌లో 2,195 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1,102 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 1,099 మంది హాజరయారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మాంటిస్సోరి, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను కలెక్టర్ రాహుల్‌శర్మ సందర్శించి పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఎస్పీ కిరణ్‌ఖరే సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 17 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం సెషన్‌లో 4,423 మందికి 2,099 మంది, సాయంత్రం సెషన్‌లో 2,097 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకున్న అదనపు ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పర్యవేక్షించిన వారిలో భూపాలపల్లి, చిట్యాల సీఐలు నరేశ్‌మార్, మల్లేశ్‌యాదవ్, గణపురం ఎస్సై రేఖ అశోక్ ఉన్నారు.

పిచ్చికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

ఇద్దరు బాలురకు, అంగన్వాడీ ఆయాకు..

చిట్యాల/కాటారం, డిసెంబర్ 16: చిట్యాల మండలంలోని ఒడితల గ్రామంలో పిచ్చి కుక్క దాడి చేయడంతో ఇద్దరు బాలురకు గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం గ్రామానికి చెందిన కందుకూరి రాహుల్‌చారి తన ఇంటి ముందు ఆడుకుంటుండగా, పాశిగడ్డతండా గ్రామానికి చెందిన జరుపుల వర్షిత్ తల్లిదండ్రులతో కలిసి ఒడితలకు రాగా పిచ్చి కుక్క వేర్వేరుగా దాడి చేసింది. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా వారిని భూపాలపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అదేవిధంగా కాటారం మండలం దంతలపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడీ ఆయా దుర్గమ్మపై కుక్క దాడి చేయగా కాలికి తీవ్ర గాయమైంది. వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదివాసీలతో సీఆర్‌టీ పోస్టులు భర్తీ చేయాలి

ఏటూరునాగారం, డిసెంబర్ 16 : ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్‌టీలను ఆదివాసీ అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరుతూ ఐటీడీఏ ఎదుట తుడుందెబ్బ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. జనరల్ అభ్యర్థులతో సీఆర్‌టీ పోస్టులు భర్తీ చేయొద్దన్నారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిశె బాలకృష్ణ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల్లో ఆదివాసీలతోనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న ఐటీడీఏ ఎదుట నిర్వహించే మహా ధర్నాను ఆదివాసీలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు పొడెం బాబు, పాపారావు, నాగేశ్వర్‌రావు, ఆలం నగేశ్, సంతోష్, సులోచన, శమంతకమణి పాల్గొన్నారు.

దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడిగా రవీందర్

గణపురం, డిసెంబర్ 16: దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడిగా మండలకేంద్రానికి చెందిన పరుష రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండలకేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు కొడారి సారయ్య ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పరుష రవీందర్, ఉపాధ్యక్షులుగా అట్కాపురం భీష్మాచారి, చాడ కృష్ణచార్య, వెలుగం రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా పూజారి రవీందర్, సహాయ కార్యదర్శిగా భూక్యా హరిలాల్, ప్రచార కార్యదర్శిగా గజ్జెల తిరుపతి, కోశాధికారిగా కుక్కముడి లింగయ్య, గౌరవ అధ్యక్షుడిగా సిరికొండ కృష్ణ, సభ్యులుగా దుబ్బ సరోజన, రామమూర్తి, రాజయ్య, రాగయ్య, సాంబయ్య ఎన్నికయ్యారు.

నూతన అంబులెన్స్‌కు పూజలు

మొగుళ్లపల్లి, డిసెంబర్ 16 : మండలానికి మంజూరైన అంబులెన్సుకు స్థానిక సాంబమూర్తి దేవాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నాగరాణి, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ రఫీ, కాంగ్రెస్ నాయకులు ఆకుతోట కుమారస్వామి, మోటె ధర్మారావు, తక్కళ్లపల్లి రాజు, బక్కిరెడ్డి, మహేందర్‌రెడ్డి, నడిగోటి రాము, క్యాతరాజ్ రమేశ్, బండారి కుమారస్వామి పాల్గొన్నారు.

కుమారస్వామికి అంబేద్కర్ నేషనల్ అవార్డు

గణపురం, డిసెంబర్ 16 : మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన ఇనగాల కుమారస్వామి సోమవారం బాబా సాహెబ్ అంబేద్కర్ నేషనల్ అవార్డును ఢిల్లీలోని ఆంధ్ర ఆడిటోరియం భవన్‌లో బీఎస్ఏ సహుజన సాహిత్య అకాడమీ నేషనల్ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అందుకున్నాడు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కేటీపీపీ బ్రాంచ్ అధ్యక్షుడి గా అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తూ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలపై కుమారస్వామి పోరాటం చేశారన్నారు. అవార్డును ఎంపిక చేసిన బీఎస్ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి, అవార్డు సెలక్షన్ కమిటీ మెంబర్ వంగ కుమారస్వామికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వెంకటాపూర్, డిసెంబర్ 16 : మండలంలోని సింగరకుంటపల్లి గ్రామంలో ములుగు ఏపీజీవీబీ మేనేజర్ రమేశ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత బృందంతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు అందించే వ్యవసాయ రుణాలు, మహిళ సంఘాల రుణాలు, గోల్డ్‌లోన్స్, డిపాజిట్స్, అధిక వడ్డీ, కేంద్ర ప్రభుత్వం అందించే బీమా పథకాలపై వివరించారు. ఎఫ్ఎల్‌సీ, కౌన్సిలర్ పేంకుమార్, అకౌంటెంట్, కళాజాత బృందం పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ములుగురూరల్, డిసెంబర్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేలు రెండు విడుతలుగా ఇస్తామని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రకటించారని, రాష్ట్రంలో ఎన్ని నిరుపేద కుటుంబాలు ఉన్నాయి? ఏ పద్ధతి ప్రకారం ఇస్తారు? దాని విధి విధానాలు ఏంటి? అని ప్రశ్నించారు. పింఛన్ పెంపు, రైతు భరోసా పథకాల అమలు, రూ.2 లక్షల రుణమాఫీని పూర్తి స్థాయిలో ఎప్పుడు చేస్తారని ప్రశ్నించారు. ప్రజలను మభ్య పెట్టే మాటలు మాట్లాడకుండా ఇచ్చిన ఆరు గ్యారెంటలను వెంటనే నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

22 వరకు జిల్లా స్థాయి క్రీడలు

ములుగురూరల్, డిసెంబర్ 16 : నేటి నుంచి 22వ తేదీ వరకు జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల మైదానంలో సీఎం కప్ క్రీడలు నిర్వహించనున్నట్లు జిల్లా స్పోర్ట్స్ అధికారి తుల రవి సోమవారం తెలిపారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తాడ్వాయి, డిసెంబర్ 16 : మండలంలోని వెంగ్లాపురం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హెల్త్ అసిస్టెంట్ చేల తిరుపతి తీవ్ర గాయాల పాలయ్యాడు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించే తిరుపతి రాత్రి తాడ్వాయి మండలకేంద్రానికి వస్తున్న క్రమంలో అతని స్కూటీ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు తిరుపతిని వైద్యం కోసం 108 వాహనంలో ములుగు దవాఖానకు తరలించారు.

తేనెటీగల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

వాజేడు, డిసెంబర్ 16 : తేనెటీగల దాడిలో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన సోమవారం మండలంలో జరిగింది. బాధిత మహిళ ఎట్టి రామక్క కథనం ప్రకారం.. గొంది సీత, కమలతో కలిసి వాజేడు గ్రామ శివారులోని అడవిలోకి చీపు పుల్లలు కోసేందుకు వెళ్లింది. ఈ క్రమంలో తేనెటీగలు ఒక్కసారిగా రామక్కపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఆమెతో ఉన్న మరో ఇద్దరు మహిళలు తృటిలో తప్పించుకున్నారు. రామక్కను వాజేడు పీహెచ్‌సీకి తీసుకురాగా వైద్యాధికారి మధుకర్ పరీక్షించి వైద్య సిబ్బందితో కలిసి వైద్యం అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యాధికారి తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ములుగురూరల్, డిసెంబర్ 16 : హనుమకొండ నుంచి అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు వరంగల్-2డిపో మేనేజర్ జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు 36 సీట్ల సామర్థ్యం కలిగిన సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కాణిపాకం, గోల్డెన్ టెంపులు, అరుణాచలం గిరి ప్రదక్షిణ, బీచుపల్లి హనుమాన్ టెంపుల్, గద్వాల జోగులాంబ అమ్మవారి ఆలయం దర్శనం అనంతరం తిరుగు ప్రయాణం ఉంటుందన్నారు. వివరాలకు 99592 26048, 89199 37008, 98668 32734 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉరేసుకొని ఒకరు మృతి

ములుగురూరల్, డిసెంబర్ 16 : ఉరేసుకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని మల్లంపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జంగం సురేశ్(35) వృత్తి రీత్యా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు గతంలో మృతి చెందారు. సురేశ్‌కు మరో సోదరుడు ఉండగా అతను హనుమకొండలో కుటుంబ సభ్యులతో జీవిస్తున్నాడని తెలిపారు. మృతుడు సురేశ్ ఆదివారం సాయంత్రం తన సోదరుడికి వీడియో కాల్ చేసి తనకు పెండ్లి కావడం లేదని, చనిపోతున్నానని తెలిపాడన్నారు. కంగారుపడిన సోదరుడు ఇంటి పక్కన వారికి ఫోన్ చేయగా వారు వచ్చి చూసేసరికి సురేశ్ అప్పటికే ఉరివేసుకొని మృతి చెందాడన్నారు. మృతుడి సోదరుడు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఒకే ఇంట్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మంగపేట, డిసెంబర్ 16 : ఒకే ఇంట్లో ఇద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని మల్లూరు గ్రామానికి చెందిన ఓ వివాహిత కుటుంబ కలహాలతో సోమవారం ఉదయం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం ఆమె బావకు తెలియడంతో ఆందోళనకు గురై మధ్యాహ్న సమయంలో ఆమె తాగగా మిగిలి ఉన్న పురుగుల మందును అతనూ తాగాడు. వెంటనే అతడిని కూడా అదే ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఇద్దరు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తికి చికిత్స

వాజేడు, డిసెంబర్ 16 : మండలంలోని నాగారం గ్రామానికి చెందిన పీ వెంకటేష్ సోమవారం మధ్యాహ్నం గడ్డి మందుకు సంబంధించిన పురుగుల మందు తాగాడు. గమనించిన సన్నిహితులు వాజేడు పీహెచ్‌సీకి తరలించగా పరీక్షించిన వైద్యాధికారి మధుకర్ చికిత్స అందించాడు. మెరుగైన వైద్యంకోసం 108 అంబులెన్స్‌లో ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం యువకుడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది.

జిల్లాకు చేరిన ప్రజా రగ్ జోల్ యాత్ర

ములుగురూరల్, డిసెంబర్16 : సేవాలాల్ సేన ప్రజా రగ్ జోల్ యాత్ర సోమవారం ములుగు జిల్లా కేంద్రానికి చేరింది. గట్టమ్మ వద్ద సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోరిక రాహుల్‌నాయక్, రాష్ట్ర కార్యదర్శి జంపన్నతో పాటు పలువురు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు మాట్లాడుతూ గిరిజనులకు రావాల్సిన హక్కులను పోరాడి సాధించుకునే దిశలో భాగంగా ప్రజలను చైతన్యం చేసేందుకు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం యాత్రను చేపట్టినట్లు చెప్పారు. మనల్ని మనమే రక్షించుకుంటూ గిరిజనులపై పాలకులు చూపిస్తున్న వివక్షను ఎండగడుతూ గిరిజన చట్టాలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం అధ్యక్షుడు సంతోశ్‌నాయక్, రైతు విభాగం అధ్యక్షుడు బద్రునాయక్, నాయకులు రవినాయక్, అజ్మీరా రతన్‌సింగ్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి

చిట్యాల, డిసెంబర్ 16 : విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నటు భావించాల్సి ఉంటుందని హార్ట్ ఫుల్ నెస్ లైఫ్ ఎక్స్పీరియన్స్ పొటెన్షియల్ ప్రోగ్రాం డిస్టిక్ నోడల్ కో ఆర్డినేటర్ లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీదేవి అధ్యక్షతన సదస్సును నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు మానసిక సమస్యలతో సతమతమవ్వకుండా దానికి అవసరమైన కౌన్సెలింగ్ లేదా చికిత్సను తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో డిస్ట్రిక్ కో ఆర్డినేటర్లు రవీందర్, గంగాధరచారి, సమ్మయ్య, కళాశాల లెక్చరర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

భక్తులకు మామిడి మొక్కల పంపిణీ

కాళేశ్వరం, డిసెంబర్ 16 : దర్శనం కోసం కాళేశ్వరానికి వచ్చిన భక్తులకు సోమవారం అటవీ శాఖ అధికారులు మామిడి మొక్కలు పంపిణీ చేశారు. వీటిని ఇళ్ల వద్ద నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ఆర్ రవి, ఎఫ్ఎస్‌వో ఎం ఆనంద్, ముక్తివనం పార్క్ ఎఫ్ఎస్‌వో తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

మహదేవపూర్, డిసెంబర్ 16: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో చేపట్టిన పనులపై 14వ విడుత సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం వచ్చిన తనిఖీ బృందానికి ఉపాధి పనుల కోసం ఖర్చు చేసిన రూ.4,44,67,006 రికార్డులను అప్పగించినట్లు చెప్పారు. మూడు రోజుల పాటు ఆయా గ్రామాల్లో ఆడిట్ నిర్వహిస్తారని, అవకతవకలను గుర్తించి ప్రజా వేదికలో చదివి వినిపిస్తారన్నారు.

గిరిజన దర్బార్‌లో వినతులు

ఏటూరునాగారం, డిసెంబర్ 16 : ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించగా ఏవో రాజ్‌కుమార్ వినతులు స్వీకరించారు. మండలంలోని చెల్పాక గ్రామంలోని పెద్ద చెరువు మత్తడి కాల్వ నీళ్లు పంట పొలాల్లోకి రాకుండా మళ్లించాలని, బానాజీ బంధంలోని సమ్మక్క, సారలమ్మ జాతర నిర్వహణకు నిధులు కేటాయించాలని సుమతి వినతి సమర్పించారు. గోగుపల్లి గ్రామానికి చెందిన జరుపుల భానుచందర్ గిరి వికాస్ కింద బోర్లు ఇప్పించాలని విన్నవించారు. మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన కంపెల్లి అరుణ భూమి సర్వే కోసం దరఖాస్తు సమర్పించారు. దర్బార్‌లో డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్, ఆర్ఐటీఏ ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రెడ్డి, పెసా కో ఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, ఎన్ఆర్‌హెచ్ఎం మేనేజర్ మహేందర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, ADDIKILA MANASA D/o ADDIKILA SRINIVAS (New Name) previously called as VANGA MANASA W/o VANGA CHAITANYA KUMAR (Old Name) and Residing at H.No.1-1-47/4, Chaitanyapuri Colony, Opp. NIT, Hanumakonda Dist-506004, TG.
NTW-000

CHANGE OF NAME

★I, VANGA NAGAMANI W/o VANGA LAXMAIAH (New Name) Previously called as SWARGAM NAGAMANI D/o JAGANNATHAM (Old Name) H.No. 1-1-47/4, Chaitanyapuri Colony, Opp. NIT, Hanumakonda Dist-506004, T.G.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

భూ తగాదాలతోనే సారయ్య హత్య

- కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి
- ఐదుగురు నిందితుల అరెస్టు

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాటారం, డిసెంబర్ 16 : ఆస్తి పంపకాల తగాదాతోనే ఈనెల 14న మండలంలోని దేవరాంపల్లిలో సొంత అన్న మారుపాక సారయ్యను తమ్ముడు, కుటుంబ సభ్యులు పథకం ప్రకారం హత్య చేశారని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఐదుగురు ప్రధాన నిందితులు మారుపాక సమ్మయ్య, మారుపాక అంజి, మారుపాక లక్ష్మి, మారుపాక స్వప్న, మరో మైనర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులకు హత్య వివరాలు వెల్లడించారు. మృతుడు సారయ్య, నిందితులకు తండ్రి సంపాదించిన భూమి పంపకాల విషయంలో తగాదాలు ఉన్నాయన్నారు. సారయ్యకు సమ్మయ్య నుంచి 2 గుంటలు, లక్ష్మి నుంచి 3 గుంటల భూమి మొత్తం 5 గుంటల భూమిని ఇస్తామని గత ఫిబ్రవరిలో గ్రామ పెద్దల సమక్షంలో నిందితులు అంగీకరించారని, కానీ ఒప్పందం ప్రకారం ఇవ్వలేదన్నారు. ఈ క్రమంలో ఈనెల 14న దేవరాంపల్లిలో మళ్లీ పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగిందని, నిందితులు ఆ భూమి సారయ్యకు ఇవ్వడానికి అంగీకరించలేదన్నారు. దీనిని మనసులో పెట్టుకొని తమ్ముడు సమ్మయ్య, అతడి భార్య స్వప్న, కొడుకు అంజి, మరో సోదరుడి భార్య లక్ష్మి, మరో మైనర్ కలిసి పథకం ప్రకారం సారయ్య కుటుంబాన్ని చంపేందుకు పథకం పన్నారు. కారం పొడి, సుత్తె, గొడ్డలితో బైక్‌పై వస్తున్న సారయ్య మెడ, తలపై విచక్షణా రహితంగా దాడి చేశారు. అతని కుమారుడు శ్రీరామ్‌పై కూడా దాడి చేయగా తప్పించుకొని పారిపోయాడన్నారు. చుట్టు పక్కల వారు రావడంతో నిందితులు అక్కడి నుంచి పరారైనట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కొన ఊపిరితో రక్తపు మడుగులో పడి ఉన్న సారయ్యను మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు శ్రీరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరించి దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. నిందితులను బొప్పారం క్రాస్ వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేశామని ఒప్పుకున్నారన్నారు. కాగా, ఈ కేసును ఛేదించిన కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, సిబ్బంది వెంకటేశం, హరికుమార్, లవన్, లక్ష్మీరాజు, ప్రసాద్, తిరుపతి, రఘు, జంపన్నను డీఎస్పీ అభినందించారు.

భూపాలపల్లి జిల్లా బేస్ బాల్ జట్ల ఎంపిక

కాటారం, డిసెంబర్ 16 : హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న సీనియర్ రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలకు జిల్లా జట్లను సోమవారం మండలంలోని గిరిజన పాఠశాల మైదానంలో ప్రకటించారు. పాఠశాల హెడ్ సత్యశివలక్ష్మి ముఖ్యతిథిగా హాజరై ఎంపిక పోటీలు ప్రారంభించగా, జిల్లా నలుమూలల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. సెలక్షన్ కమిటీ సభ్యులు పూర్ణిమ, వీరన్న, ఈరగోని రాజు బ్యాటింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో జిల్లా జట్టును ఎంపిక చేశారు. వీరిలో మహిళా జట్టులో కెప్టెన్‌గా అనూష, సభ్యులుగా ఐశ్వర్య, సుచరిత, నాగలక్ష్మి, పావని, జ్యోత్స్న, అక్షిత, శ్రీలేఖ, సంజన, అంజలి, ప్రణిత, సాయికీర్తన, కల్యాణి, రిత్విక, ప్రణవి, శ్వేత, అపర్ణ, కావ్య ఎంపిక కాగా, పురుషుల జట్టు నుంచి ఆయాన్ష్ (కెప్టెన్), రాజు, మనోజ్, రాహుల్, సమీర్, ప్రశాంత్, వినయ్, అక్షయ్, శ్యామ్, రాజకర్, అభిరాం, కార్తీక, అక్షిత్ కుమార్, హుస్సేన్, అనీస్, శివరాజ్, సాయి వెంకటవర్షిత్, మనికంత ఎంపికైనట్లు అసోసియేషన్ చైర్మన్ మంచిక నరసింహ రామయ్య తెలిపారు. కాగా, జట్టు కోచ్‌గా శైలజ, పూర్ణిమ, మేనేజర్‌గా తిరుపతి,రాజు వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో స్కూల్, అసోసియేషన్ కార్యదర్శి అభినవ వినయ్, జాయింట్ సెక్రెటరీ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం జీపీలో విలీనం చేయొద్దు

వాజేడు, డిసెంబర్16 : మండలంలోని ధర్మవరం గ్రామ పంచాయతీలో చింతూరు జీపీలోని భువనపల్లి, భీమవరం గ్రామాలను విలీనం చేయొద్దని కోరుతూ ధర్మవరం గ్రామస్తులు సోమవారం కలెక్టర్ దివాకరతో పాటు, డీపీవో దేవరాజ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. 2019లో ధర్మవరం గ్రామాన్ని జీపీగా చేశారని తెలిపారు. కొంతమంది స్వార్థంతో చింతూరు జీపీలోని భీమవరం, భువనపల్లి గ్రామాలను ధర్మవరంలో విలీనం చేయాలని చూస్తున్నారని, అలా చేయడం వల్ల గ్రామస్తులకు నష్టం కలుగుతుందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గౌరరావు సర్వేశ్వర్‌రావు, గారా తిరుపతి, గగ్గూరి అశోక్, గార జనార్దన్, సత్యనారాయణ, విక్రమ్, ముత్తెబోయిన నరేశ్, బొల్లె రమేశ్ ఉన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ములుగురూరల్, డిసెంబర్16 : ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ దివాకర ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి 27 దరఖాస్తులను స్వీకరించారు. పెండింగ్ బిల్లుతో పాటు వివిధ సమస్యలను కలెక్టర్‌కు ప్రజలు వివరించారు. వినతులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించాలి : ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 16 : ప్రజల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ చట్ట ప్రకారం పరిష్కారానికి చొరవ చూపాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దివాస్‌లో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ 16 మంది బాధితులు ఫిర్యాదు చేయగా, వారి వివరాలు సంబంధిత పోలీస్ అధికారులకు వివరాలు తెలిపి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

ములుగురూరల్, డిసెంబర్ 16 : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిరంతరం టీబీ నిర్ధారణ పరీక్షలు చేసి, వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో జాతీయ టీబీ నియంత్రణపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. టీబీ కేసులను అరికట్టేందుకు మందులను సరఫరా చేసి రోగ వ్యాప్తిని అరికట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విపిన్‌కుమార్, వైద్యులు శ్రీకాంత్, చంద్రకాంత్, సిబ్బంది దర్గారావు, పుల్లూరి సమ్మయ్య, రాజు, చంద్రమౌళి, రవి, పరశురాం, సాంబయ్య, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 16 : సింగరేణి ఆవిర్భావ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎస్‌వోటు జీఎం కవీంద్ర అన్నారు. సోమవారం కృష్ణకాలనీ అంబేద్కర్ స్టేడియంలో కొనసాగుతున్న సింగరేణి ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం రవికుమార్, ఏరియా అధికార ప్రతినిధి మారుతి, డీవై ఎస్ఈ బాలరాజు, డీవై పీఎం క్రాంతి కుమార్, ఎస్ఆర్ పీవో శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : పీవో

వెంకటాపురం(నూగూరు), డిసెంబర్ 16 : గిరిజన దర్బార్‌లో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన ప్రజలు 18 దరఖాస్తులు ఇవ్వగా ఆమె స్వీకరించారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దని, ప్రజల సమస్యలు పరిష్కరించి వారి మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.